E69 NEWS
# తెలుగు గళం
సామాన్యుల గుండె చప్పుడు

AUG 29

## తెలుసుకుందాం !

ఆగస్టు 29 : చరిత్రలో ఈరోజు

1604: మొఘల్ చక్రవర్తి హుమాయూన్ భార్య, అక్బర్ తల్లి అయిన హమీదా బానో బేగం మరణం.

1905: హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్ జననం.

1923: భారత మాజీ క్రికెట్ క్రీడాకారుడు హీరాలాల్ గైక్వాడ్ జననం.

1988: ఆఫ్ఘనిస్తాన్ మొదటి అంతరిక్ష యాత్రికుడు అబ్దుల్ మొహమ్మంద్ తన చారిత్రక ప్రయాణాన్ని ప్రారంభించారు.

శుక్రవారం తెలుగు గళం 29 ఆగస్టు తెలంగాణ - ఆంధ్రప్రదేశ్

## భారత్‌పై మరోసారి అక్కసు వెళ్లగక్కిన అమెరికా



వాషింగ్టన్ : రష్యా చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై అమెరికా మరోసారి అక్కసు వెళ్లగక్కింది. రష్యా దురాక్రమణకు వ్యతిరేకంగా ఉక్రెయిన్‌కు అమెరికా, యూరప్ దేశాలు నిధులు సమకూర్చడానికి భారతదేశమే కారణమని వైట్‌హౌస్ వాణిజ్యసలహాదారు పీటర్‌నోవారో విమర్శించారు. బుధవారం జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య సంఘర్షణను ప్రధాని మోడీ యుద్ధంగా వైట్‌హౌస్ వాణిజ్యసలహాదారు పీటర్‌నోవారో అభివర్ణించారు. భారత్ రాయితీ ధరలకు రష్యా నుండి ముడిచమురును కొనుగోలు చేస్తోందని విమర్శించారు.

మిగతాది 3వ పేజీలో

## సుంకం లేని పత్తి దిగుమతులను పొడిగించిన కేంద్రం



న్యూఢిల్లీ : పత్తిపై సుంకం లేని దిగుమతులను మరో మూడు నెలలు పొడిగిస్తున్నట్లు కేంద్రం తెలిపింది. దేశంలోని టెక్స్‌టైల్స్ పరిశ్రమలు ఈ ఏడాది డిసెంబర్ చివరి వరకు సుంకం లేకుండా పత్తిని దిగుమతి చేసుకోవచ్చని ఆర్థిక మంత్రిత్వ శాఖ గురువారం ప్రకటించింది. ముడిపత్తిపై 11శాతం దిగుమతి సుంకాన్ని నిలిపివేస్తున్నట్లు కేంద్రం ఆగస్ట్ 18న ప్రకటించింది. ఎగుమతిదారులకు మద్దతు ఇచ్చే చర్యగా, సుంకం లేని దిగుమతిని ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు పొడిగించాలని నిర్ణయించినట్లు గురువారం నాటి ప్రకటనలో పేర్కొంది. భారతదేశ ప్రస్తుత పత్తి సీజన్ ( 2024 అక్టోబర్ 1నుండి 2025 సెప్టెంబర్ 30 వరకు) సుమారు 40లక్షల బేళ్ల దిగుమతులను ప్రభుత్వం అంచనావేసింది. తదుపరి సీజన్ (2025 అక్టోబర్ 1 నుండి 2026 సెప్టెంబర్ 30 వరకు ) కోసం కొత్త పంటరాక దీపావళి తర్వాత పెరిగే అవకాశం ఉందని తెలిపింది.

అయితే ముడిపత్తిపై 11శాతం దిగుమతి సుంకాన్ని రద్దు చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) డిమాండ్ చేస్తోంది. పత్తికి ఎంఎస్‌పి సి2ప్లస్ 50 శాతంతో క్వింటాకు రూ. 10,075చొప్పున ప్రకటించాలని, ఆత్మహత్య చేసుకున్న బాధిత రైతు కుటుంబానికి రూ. 25 లక్షలు పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేసింది. రైతుల సంక్షేమానికి, వ్యవసాయ రంగానికి నష్టం కలిగించే ఫారిన్ ట్రేడ్ అగ్రిమెంట్ (ఎఫ్‌టిఎ)ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తోంది.

## తెలంగాణలో భారీ వర్షాలు పలు జిల్లాలో విద్యా సంస్థలకు సెలవు

తెలంగాణ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉమ్మడి మెదక్, కామారెడ్డి, హైదరాబాద్ సహా అనేక జిల్లాలు వర్షాల దెబ్బకి అతలాకుతలం అయ్యాయి. కామారెడ్డిలో భారీగా కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాలు నీట మునిగాయి. రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. రోడ్డుపై నిలిపిన కార్లు వరద ధాటికి నీటిలో కొట్టుకుపోయాయి. రైలు పట్టాలు నీట మునగడంతో రైళ్ల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. ఈ క్రమంలో కామారెడ్డి, మెదక్ జిల్లాలలో అధికారులు రెడ్ అలర్ట్ ప్రకటించారు. రామాయంపేటలో సుమారు 300 మంది విద్యార్థులు వరద నీటిలో చిక్కుకున్నారు. రంగంలోకి దిగిన రెస్క్యూ బృందాలు విద్యార్థులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చాయి. భారీ వర్షాల దృష్ట్యా కామారెడ్డి, మెదక్, నిర్మల్, ఆదిలాబాద్, కొమురంభీం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీలకు ఈరోజు (ఆగస్టు 28, గురువారం) సెలవు ప్రకటించారు. తెలంగాణ విశ్వవిద్యాలయం ఈరోజు (ఆగస్టు 28న) జరగాల్సిన పీజీ, బీఎడ్, ఎమ్మేడ్ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రకటించారు. రేపు, ఎల్లుండి కూడా భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు.

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలంగాణలో వరదలు, భారీ వర్షాల వల్ల ప్రభావితమైన జిల్లాలలో గురువారం ఏరియల్ సర్వే వాతావరణం అనుకూలించకపోవడంతో వాయిదా వేసినట్లు సమాచారం.

25 జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## ఆరుగురు హమాస్ సభ్యులు మృతి : ఇజ్రాయిల్ సైన్యం



యునైటెడ్ నేషన్స్ : గాజా స్ట్రిప్ దక్షిణ ప్రాంతంలోని నాసర్ ఆసుపత్రిపై సోమవారం జరిగిన దాడిలో ఆరుగురు హమాస్ సభ్యులు మరణించారని ఇజ్రాయిల్ సైన్యం ప్రకటించినట్లు ఐక్యరాజ్యసమితిలో అమెరికా తాత్కాలిక రాయబారి డోరతీ షియా బుధవారం భద్రతా మండలికి తెలిపారు. ఇజ్రాయిల్ దాడిలో రాయిటర్స్, అసోసియేటెడ్ ప్రెస్, అల్ జజీరా, ఇతర మాధ్యమాలకు పనిచేసిన జర్నలిస్టులతో సహా కనీసం 20 మంది మరణించారు. హమాస్ పౌర మౌలిక సదుపాయాలను నిరంతరం ఉపయోగించడాన్ని ఖండించాలని మండలిని కోరుతున్నట్లు షియా పేర్కొన్నారు. కౌన్సిల్ సమావేశానికి ముందు ఇజ్రాయిల్ యుఎన్ రాయబారి డానీ డానన్ విలేకరులతో మాట్లాడుతూ%ూ% తమ లక్ష్యం ఉగ్రవాదులతో పోరాడటమని, జర్నలిస్టులతో కాదన్నారు. ఉగ్రవాదంలో పాల్గొనని ఎవరితోనూ కాదని అన్నారు.

## బీహార్ ప్రజలు తెలివైన వారు.. ఒక్క ఓటు కూడా దొంగిలించనివ్వరు



పాట్నా : బీహార్ ప్రజలు చాలా తెలివైనవారు. వారు బిజెపి, ఎన్నికలసంఘం చేత ఒక్క ఓటుని కూడా దొంగిలించనివ్వరు అని లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ అన్నారు. బుధవారం ఆయన సీతామర్హిలో జరిగిన ఓటర్ అధికార్ యాత్రలో మాట్లాడారు. ఓట్లచోరీపై ఆయన బిజెపి ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని తీవ్రంగా విమర్శించారు. పేద ప్రజల గొంతును నొక్కేసేందుకే.. బిజెపి వారి ఓట్లను దొంగిలించింది. అయితే పేద ప్రజల గొంతును నొక్కే ప్రయత్నానికి ఇండియా కూటమి ఒప్పుకోదు. పేద ప్రజలకు అండగా ఉంటుంది అని అన్నారు.

'వారు బీహార్ ఎన్నికల్లో ఓట్లను దొంగిలించేందుకు ప్రయత్నిస్తున్నారని మాకు తెలుసు. అందుకే మేము ఓటర్ అధికార్ యాత్రను ప్రారంభించాము. బీహార్ ప్రజలు తెలివైనవారు. బిజెపి, ఎన్నికల కమిషన్ చేత ఓట్లు చోరీ కాకుండా జాగ్రత్తగా ఉన్నారు. అంబేద్కర్‌జీ ఈ దేశానికి రాజ్యాంగాన్ని అందించారు. రాజ్యాంగ పుస్తకం సాధారణ పుస్తకం కాదు. అది భావజాలం ప్రతిబింబాల పుస్తకం' అని అన్నారు. దళిత సోదరుల్ని స్వాతంత్ర్యానికి ముందు అంటరానివారిగా పరిగణించారు. కానీ అంబేద్కర్ అందించిన ఈ రాజ్యాంగం వారికి హక్కుల్ని ఇచ్చింది. కానీ బిజెపి వారి హక్కుల్ని లాగేసుకుంటుంది. వారి గొంతుల్ని నొక్కేందుకు పేదల ఓట్లను దొంగిలిస్తున్నారు. నేను చెబుతున్నాను%ూ% మీ గొంతును బిజెపి వారు నొక్కేయలేరు. మేము మీ వెంట నిలబడతాం' అని రాహుల్ అన్నారు.

## జమ్మూ కాశ్మీర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు మృతి



కాశ్మీర్: జమ్మూ కాశ్మీర్‌లోని బందిపోరాలో గురువారం ఇద్దరు ఉగ్రవాదులు చొరబాటుకు యత్నించారు. దీంతో భారత్ సైన్యం కాల్పులు జరిపింది. ఈ కాల్పులలో ఇద్దరు ఉగ్రవాదులు మృతి చెందినట్లు సైన్యం తెలిపింది. గురెజ్ సెక్టార్‌లో అప్రమత్త దళాలు అనుమానాస్పద కార్యకలాపాలను నిర్వహిస్తుండగా ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. దీంతో దళాలు సమర్థవంతంగా కాల్పులు జరపడంతో ఇద్దరు ఉగ్రవాదులు మృతి చెందారని ఆర్మీ ప్రతినిధి తెలిపారు. గురెజ్‌లోని నౌషేరా నార్ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని ఆర్మీ తెలిపింది. గురెజ్ సెక్టార్‌లో చొరబాటు ప్రయత్నం జరిగే అవకాశం ఉందని జమ్మూ కాశ్మీర్ పోలీసులు నిఘా సమాచారం అందించిన తర్వాత ఈ ఆపరేషన్ ప్రారంభించినట్లు ఆర్మీ తెలిపింది.

## జమ్ము-శ్రీగర్ జాతీయరహదారి మూసివేత



జమ్ము : జమ్ముకాశ్మీర్‌ను భారీ వర్షాలు వణికిస్తున్నాయి. మంగళవారం నుండి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఉదంపూర్- రాంబన్‌ల మధ్య కొండచరియలు విరిగిపడ్డాయని అధికారులు తెలిపారు. దీంతో జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిని వరుసగా మూడవరోజు గురువారం కూడా మూసివేశామని అన్నారు. జాతీయ రహదారిని మూసివేయడంతో సుమారు 500నుండి 600కు పైగా వాహనాలు మార్గమధ్యలో వివిధ ప్రదేశాలలో చిక్కుకున్నాయి.

మిగతాది 3వ పేజీలో

## అమెరికా పాఠశాలలో కాల్పులు - ముగ్గురు మృతి



అమెరికా: అమెరికాలోని కాథలిక్ పాఠశాలలో ఒక వ్యక్తి జరిపిన కాల్పులలో ఇద్దరు మృతి చెందగా, 17 మంది పిల్లలు గాయపడ్డారు. ఈ ఘటనలో కాల్పులు జరిపిన వ్యక్తి కూడా మృతి చెందాడని పోలీసులు తెలిపారు. రైఫిల్, షాట్‌గన్ మరియు పిస్టల్‌తో ఆయుధాలు ధరించి ఒక వ్యక్తి అనౌన్సియేషన్ కాథలిక్ స్కూల్‌లో ప్రార్థన సమయంలో చర్చి వైపుకు వచ్చి కిటికీల గుండా కాల్పులు జరిపాడని పోలీసులు తెలిపారు. మరణించిన పిల్లలు 8, 10 సంవత్సరాల వయస్సు గలవారని, గాయపడిన వారిలో మరో 14 మంది పిల్లలు ఉన్నారని పోలీసుల అధికారి చెప్పారు. కాల్పులు జరిపిన వ్యక్తిపై నేర చరిత్ర లేదని, ఒంటరిగా వ్యవహరించాడని నమ్ముతున్నామని పోలీసు అధికారి పేర్కొన్నారు.

## జర్నలిస్ట్ అభిసర్ శర్మకు అరెస్ట్ నుండి మధ్యంతర రక్షణ



న్యూఢిల్లీ : జర్నలిస్ట్ అభిసర్ శర్మకు సుప్రీంకోర్టు గురువారం అరెస్ట్ నుండి నాలుగు వారాల మధ్యంతర రక్షణ కల్పించింది. అస్సాం ప్రభుత్వ విధానాలను విమర్శిస్తూ చేసిన వీడియో పోస్ట్‌పై రాష్ట్ర పోలీసులు నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌ను సవాలు చేసేందుకు గౌహతి హైకోర్టును ఆశ్రయించాలని ఆదేశించింది. బిఎన్‌ఎస్‌లోని సెక్షన్ 152 ( భారతదేశ సార్వభౌమత్వం, ఐక్యత మరియు సమగ్రతకు హాని కలిగించే చర్యలు) జర్నలిస్ట్‌పై కేసు నమోదు చేసింది.

సెక్షన్ 152 అనేది 'సభ్యులందరి నిబంధన'గా మారిందని, భిన్నాభిప్రాయాలను అణచివేసేందుకు విచక్షణారహితంగా ప్రయోగించబడుతోందని జర్నలిస్ట్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదించారు. గౌహతి హైకోర్టుకు వెళ్లకుండా పిటిషనర్ నేరుగా సుప్రీంకోర్టును ఎందుకు ఆశ్రయించారని జస్టిస్ ఎం.ఎం.సుందరేష్ మరియు జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. ఎఫ్‌ఐఆర్‌పై సవాలు పిటిషన్‌ను స్వీకరించమని, పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించేందుకు వీలుగా నాలుగు వారాల మధ్యంతర రక్షణను మంజూరు చేస్తున్నామని ధర్మాసనం తెలిపింది. బిఎన్‌ఎస్ సెక్షన్ 152 రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తూ శర్మ దాఖలు చేసిన పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వ స్పందన కోరింది. ఈ నిబంధన హానిని సవాలు చేసే ఇతర పెండింగ్ పిటిషన్‌లతో దీనిని జతచేయడానికి ధర్మాసనం అంగీకరించింది. ముఖ్యమంత్రి విధానాలు, రాజకీయాలను విమర్శించడం భారతదేశ ఐక్యతపై దాడిగా పరిగణించబడదని, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చే ప్రతి భిన్నాభిప్రాయాన్ని 'జాతి వ్యతిరేక' నేరంగా పరిగణిస్తే, భావప్రకటనా స్వేచ్ఛకు రాజ్యాంగ హామీ భ్రమగా మారుతుందని జర్నలిస్ట్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

## పన్నుల వల్ల భారత్ అమెరికా సంబంధాలు దెబ్బతింటాయి



న్యూఢిల్లీ : అమెరికా 50 శాతం పన్నుల వల్ల భారత్‌లోని రొయ్యల రైతులు, వస్త్ర తయారీదారులు వంటి చిన్న ఎగుమతిదారులను దెబ్బతీస్తుందని మాజీ ఆర్‌బిఐ గవర్నర్ రఘురామరాజన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పన్నుల పెంపు తీవ్ర బాధాకరం అని ఆయన వ్యాఖ్యానించారు. భారత్- అమెరికా సంబంధాలకు కూడా పెద్దదెబ్బేనని.. భవిష్యత్తులో ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు దెబ్బతినే అవకాశం ఉందని ఆయన అన్నారు. అయితే ట్రంప్ సుంకాల వల్ల భారత్ మేల్కొనేందుకు ఇదొక అవకాశమని, దీనిని మేల్కొలుపు పిలుపుగా ఆయన అభివర్ణించారు.

మిగతాది 3వ పేజీలో

## ఎనిమిదవ తరగతి విద్యార్థిపై టీచర్ దాడి.. మూడు చోట్ల విరిగిన ఎముకలు..!



విశాఖపట్నం : విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. వారిని శారీరకంగా హింసిస్తున్నారు. విద్యర్థులను చదువు చెప్పే ఉపాధ్యాయులే చితకబాదే ఘటనలు నిత్యం చూస్తూ, వింటూనే ఉంటాం. తాజాగా ఇలాంటి ఘటనే విశాఖలో జరిగింది. విశాఖపట్నం మధురవాడలోని పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో శ్రీ తనుష్ పాఠశాలలో అమానుష ఘటన చోటుచేసుకుంది. సదరు పాఠశాలలో 8వ తరగతి చదువుతోన్న విద్యార్థి చేయి విరగొట్టాడు ఉపాధ్యాయుడు. విద్యార్థి చేతిని ఇనుప బల్ల కేసి చితకబాది.. ఆపై పిడుగులు గుద్ది చేయి విరగగొట్టాడు. దీంతో ఆ విద్యార్థికి శరీరంలో మూడు భాగాల్లో ఎముకలు విరిగాయి. శస్త్ర చికిత్స కోసం విద్యార్థిని మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. విద్యార్థిపై దాడికి కారణమైన సోషల్ మాస్టర్ మోహన్.. ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. ఈ ఘటనపై స్కూల్ ప్రిన్సిపల్ పిళ్లా శివ సత్యనారాయణ నిలదీయగా అతను నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థి తల్లిదండ్రుల చెప్పారు. ఇక, స్కూల్ వద్ద సదరు విద్యార్థి తల్లిదండ్రులు, కాలనీవాసులు ఆందోళనకు దిగారు.

# బషీర్‌బాగ్ నుంచి జలియన్‌వాలా బాగ్ వరకుప్రజల హక్కుల పోరాటంలో త్యాగాల ప్రేరణ




## వారి త్యాగం తెలుగు రాష్ట్రాల చరిత్రలో ఒక మైలురాయి

**తెలుగు గళం న్యూస్ ఆగస్టు 28**

ఇవాళ్టి రోజున 25 ఏళ్ల క్రితం విద్యుత్ ఉద్యోగుల ఉద్యమం కోసం బషీర్‌బాగ్‌లో తమ ప్రాణాలను అర్పించిన విద్యుత్ అమరులను రాష్ట్ర ప్రజలు స్మరించుకుంటున్నారు. 2000 ఆగస్టు 28న విద్యుత్ కార్మికుల ఆందోళన సందర్భంగా పోలీసుల కాల్పుల్లో రామకృష్ణ,విష్ణువర్ధన్ రెడ్డి,బాలస్వామి ప్రాణాలు కోల్పోయారు.ఆ ఘటన అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది.విద్యుత్ శాఖ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ,రైతులకు,ప్రజలకు ఉచిత కరెంట్,తక్కువ ధరలో విద్యుత్ అందించాలని డిమాండ్ చేస్తూ ఉద్యమం కొనసాగిన సందర్భంలో ఈ త్యాగం జరిగింది.ఆగస్టు 28న వారిని స్మరించుకుంటూ రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కార్మిక సంఘాలు,రైతు సంఘాలు,రాజకీయ నాయకులు నివాళులు అర్పించారు.ప్రజలు కూడా అమరుల త్యాగాన్ని జ్ఞాపకం చేసుకుంటూ,వారి వల్లే నేడు ఉచిత కరెంట్ పథకం సాధ్యమైందని గుర్తు చేసుకున్నారు.“విద్యుత్ అమరుల త్యాగమే ప్రజల ఇళ్లలో వెలిగే ప్రతి దీపానికి మూలం”అని పలువురు నాయకులు,సంఘాలు పేర్కొన్నాయి.

# జనగామ జిల్లాకు 500 మెట్రిక్ టన్నుల యూరియా రాక

**రైతులకు కొరత లేకుండా సరఫరా చేయాలని**

**ఎమ్మెల్యే కడియం శ్రీహరి సూచనలు**



**తెలుగు గళం న్యూస్, జనగామ**

జనగామ జిల్లాలో రైతులకు ఎరువుల కొరత తలెత్తకుండా అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి,స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశించారు.జిల్లాకు తాజాగా 500 మెట్రిక్ టన్నుల యూరియా చేరగా,రైతులకు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు.ఈ మేరకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆధ్వర్యంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ..సాగునీటిని సద్వినియోగం చేస్తూ చివరి ఆయకట్టుకు నీరు చేరేలా అధికారులు ముందస్తు ప్రణాళికతో పని చేయడం ప్రశంసనీయమని అన్నారు.యూరియా పంపిణీలో పారదర్శకత కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానంను తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు.జిల్లాలో ప్రత్యేక యూరియా స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయడానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు.అదేవిధంగా స్టేషన్ ఘనపూర్ పట్టణంలోని బాలుర సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని పరిశీలించిన ఆయన,త్రాగునీరు సరఫరా,మరుగుదొడ్ల నిర్మాణం,భవన మరమ్మతులపై అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు సూచించారు.ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ)బెన్షా లోమ్,ఆర్డీఓ వెంకన్న,జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి అంబికా సోనీ,నీటిపారుదల శాఖ ఎస్.ఈ సుధీర్,డి.ఈ లు సునీల్ కుమార్,రవికుమార్,సంపత్ తదితరులు పాల్గొన్నారు.జిల్లాలో యూరియా కొరత తలెత్తకుండా సరఫరా చేయడం,సాగునీరు ప్రతి రైతు పొలానికి చేరేలా చూడడం అధికారుల ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# బషీర్‌బాగ్ రక్తస్మృతి - ప్రజాస్వామ్యాన్ని కదిలించిన రోజు










**తెలుగు గళం న్యూస్ డెస్క్ ప్రతినిధి**

28 ఆగస్టు 2000 సంవత్సరం హైదరాబాద్ బషీర్‌బాగ్ చరిత్రలో రక్త అక్షరాలతో లిఖించబడిన రోజు.విద్యుత్ రంగంలో ప్రైవేటీకరణ,రైతులకు ఇచ్చే రాయితీల తగ్గింపుపై నిరసన తెలిపేందుకు వేలాది మంది విద్యుత్ ఉద్యోగులు,రైతులు,విద్యార్థులు ఒకే వేదికపైకి వచ్చారు.అది కేవలం ఉద్యోగ భవిష్యత్తు కోసం,లేదా రైతుల సబ్సిడీ కోసం మాత్రమే కాదుబీప్రజాస్వామ్య హక్కుల కోసం,సమాన అవకాశాల కోసం జరిగిన పోరాటం.అయితే ఆ పోరాటం శాంతియుత మార్గంలో సాగుతుండగానే,పోలీసు కాల్పులు ఆ నిరసనపై రక్త ముద్ర వేశాయి.ముగ్గురు యువకులు రామకృష్ణ,విష్ణువర్ధన్ రెడ్డి,బాలస్వామి,గుంపు మధ్యే బలిదానమయ్యారు.వీరి మరణం ఒక్క కుటుంబానికి కాదు,రాష్ట్రానికి శాశ్వత నష్టమే. చరిత్ర వారిని“విద్యుత్ అమరులు”గా స్మరించుకుంటోంది.

**బషీర్ బాగ్ ఘటన జలియన్‌వాలా బాగ్ ప్రతిబింబం**

1919లో అమృత్‌సర్‌లోని జలియన్‌వాలా బాగ్‌లో నిరాయుధ ప్రజలపై జరిగిన కాల్పులు భారత స్వాతంత్ర్య ఉద్యమాన్ని మలుపు తిప్పాయి.అదే విధంగా,2000లో బషీర్‌బాగ్‌లో చోటుచేసుకున్న రక్తపాతం,రాష్ట్ర రాజకీయాలకు,ప్రజా ఉద్యమాలకు ఒక కొత్త దిశను చూపింది.జలియన్‌వాలా బాగ్ కాల్పులు బ్రిటిష్ పాలన అమానుషతను వెలుగులోకి తెచ్చాయి.బషీర్‌బాగ్ కాల్పులు ప్రజల హక్కులను అణచివేసే అధికార తత్వాన్ని బహిర్గతం చేశాయి.ఇరువురి సంఘటనలు ఒక సత్యాన్ని చెబుతున్నాయి:ప్రజల గొంతును బలవంతంతో ఆపలేరుబీరక్తం చిందితే అది మార్పుకి విత్తనం అవుతుంది.త్యాగం ఫలితంగా లభించిన వరప్రసాదం.బషీర్‌బాగ్ త్యాగం తరువాత రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గక తప్పలేదు.రైతులకు ఉచిత విద్యుత్ పథకం ప్రవేశపెట్టబడింది.విద్యుత్ రంగం ప్రైవేటీకరణ యత్నాలు తాత్కాలికంగా ఆగిపోయాయి.ఉద్యోగ భద్రతపై భరోసా కలిగింది.ఈ మార్పులు నేటికీ ప్రజలు అనుభవిస్తున్నవే.ప్రతీ ఏడాది ఆగస్టు 28న విద్యుత్ అమరులను స్మరించుకోవడం కేవలం ఒక ఆచారం కాదు,ఒక బాధ్యత.రైతులకు:మీ పొలాల్లో వెలుగులు నింపిన ఆ రక్తపు త్యాగాన్ని మరవకూడదు.ఉద్యోగులకు:మీ భవిష్యత్తు కోసం పోరాడిన వీరిని ఆదర్శంగా తీసుకోవాలి.ప్రభుత్వాలకు:ప్రజల హక్కులపై దాడి చేసే ప్రతి ప్రయత్నం,చివరికి ప్రజా ఆగ్రహానికి లొంగక తప్పదనే పాఠం గుర్తుంచుకోవాలి.బషీర్‌బాగ్ సంఘటనను జలియన్‌వాలా బాగ్‌తో పోల్చడం అతిశయోక్తి కాదు.ఇరువురూ నిరాయుధ ప్రజల రక్తాన్ని త్రాగిన ఘటనలే.ఒకటి స్వాతంత్ర్య ఉద్యమాన్ని ఉధృతం చేసిందిబీమరొకటి ప్రజాస్వామ్యంలో ప్రజా హక్కులను కాపాడింది.విద్యుత్ అమరులు మనకు ఒక స్పష్టమైన సందేశం ఇచ్చారు:ప్రజల ప్రయోజనం కోసం చేసిన త్యాగం ఎన్నటికీ వృథా కాదు.అది ఒక కొత్త యుగానికి నాంది పలుకుతుంది.

# విద్యార్థుల కు టై బెల్ట్ ల పంపిణీ



**మహబూబాబాద్ జిల్లా తెలుగు గళం న్యూస్**

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని రాంపురం గ్రామంలో ని పూర్వ విద్యార్థి రాంపల్లి విజయకుమార్ సహకారంతో ఎంపీపీ ఎస్ రాంపురం విద్యార్థులకు టై బెల్ట్ ల పంపిణీ చేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేను చదువుకున్న పాఠశాల కు ఏదో ఒకటి చెయ్యాలి అని విద్యార్థుల కు ఉపయోగ పడే విధంగా టై బెల్ట్ లు పంపిణీ చేయడం జరిగింది అన్నారు, కార్యక్రమంలో రాంపురం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శశిధర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు హీరాలాల్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పసుపులేటి శోభ,ఉపాధ్యాయులు గుర్రం వెంకన్న గౌడ్, శ్రీధర్ గ్రామస్తులు రాంపల్లి వెంకన్న గౌడ్,రాంపల్లి శివమణి,రా రాంపల్లి రంజిత్ గౌడ్,బందు పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి జిల్లాలోని సిపిఎం పార్టీ కార్యకర్తలు సేవా కార్యక్రమాలలో పాల్గొని తుఫాను, వరద బాధితులకు సహాయ సహకారాలు అందించాలి

ఇంకా వర్షాలు రెండు, మూడు రోజులు వర్షాలు కొనసాగే అవకాశం ఉన్నందున కామారెడ్డి జిల్లా ప్రజలందరూ అలాగే పట్టణ కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్, ద్వారక నగర్, బృందావన్ కాలనీ, జి ఆర్ కాలనీ, కౌండిన్య కాలనీ, బతుకమ్మ కుంట, గాంధీ నగర్ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సురక్షిత ప్రదేశాల్లో ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నానుసిపిఎం కార్యకర్తలు, కాస్త చైతన్యం కలిగిన యువత అత్యవసరంగా క్షేత్రస్థాయికి చేరుకొని సేవా కార్యక్రమాలు చేపట్టి బాధితులకు సహాయ సహకారాలు అందించాల

# విద్యుత్ పోరాట అమరవీరులస్ఫూర్తితో ఉద్యమించాలి.

**ప్రజలకు ఉచితంగా ఇస్తున్న విద్యుత్ బషీర్ బాగ్ విద్యుత్ పోరాట అమరుల ప్రాణత్యాగం ఫలితమే-మునిగెల రమేష్ సిపిఎం మండల కార్యదర్శి**

**తెలుగు గళం న్యూస్ (స్టే)ఘన్ పూర్ ఆగస్టు 28**

విద్యుత్ పోరాట అమరవీరుల స్ఫూర్తితో పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్ పిలుపునిచ్చారు.గురువారం (స్టే)ఘనపూర్ మండల కార్యాలయంలో పార్టీ ఆధ్వర్యంలో బషీర్బాగ్ విద్యుత్ పోరాట అమరవీరుల 25వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యుత్ పోరాట మృతవీరులు విష్ణువర్ధన్ రెడ్డి,బాలస్వామి,రామకృష్ణ ల చిత్రపటానికి పార్టీ మండల కమిటీ సభ్యులు సీనియర్ నాయకులు కుర్ర ఉప్పలయ్యతో కలిసి పూలమాలవేసి నివాళి అర్పించారు.ఈ సందర్భంగా మునిగెల రమేష్ మాట్లాడుతూ..2000 సంవత్సరం ఆనాటి ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అవలంబించిన ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తూ విద్యుత్ రంగాన్ని ప్రపంచ బ్యాంకు షరతుల్లో భాగంగా విద్యుత్ సంస్కరణలు అమలు చేస్తూ రైతాంగం పై,ప్రజలపై మోపుతున్న విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా రాష్ట్రంలో ఉతృతమైన ఉద్యమాలు జరిగాయన్నారు.ప్రైవేటీకరణ ఆపివేయాలని,ప్రజలపై విద్యుత్ బారాలు వద్దే వద్దు అంటూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లాల్లో ప్రజాగ్రహాన్ని చవిచూసిన ఉద్యమం విద్యుత్ పోరాటం అన్నారు.దాదాపు రాష్ట్రవ్యాప్తంగా 100 రోజులపాటు ఈ విద్యుత్ ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమం 9 వామపక్ష,కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో జరిగిందని అన్నారు.ప్రతి గడపకు ఈ ఉద్యమం వెళ్లిందని విద్యుత్ ప్రైవేటీకరణ జరిగితే పేదలకు,రైతాంగానికి తీవ్రమైన నష్టమని గ్రహించిన ప్రజలందరూ పల్లె పల్లె నుండి ఈ ఉద్యమంలో భాగస్వామ్యం అయ్యారని ఈ సందర్భంగా నిర్వహించిన చలో హైదరాబాద్ కార్యక్రమంలో వేలాదిమంది ప్రజలు పాల్గొన్నారని అన్నారు.పాలక ప్రభుత్వం పోలీసులను ఉసిగొల్పి ఆగస్టు 28 న బషీర్బాగ్ వద్ద ముగ్గురు అమరులను కాల్చి చంపిందని అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున బంద్ కు పిలిపిస్తే ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని బంద్ ను జయప్రదం చేయడం జరిగిందన్నారు.అనంతరం జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో ప్రజలు తెలుగుదేశం ప్రభుత్వాన్ని నామరూపాలు లేకుండా ఓడించారన్నారు.ముగ్గురు అమరవీరుల బలిదానంతో నేటికీ పాలక ప్రభుత్వాలు విద్యుత్ చార్జీలు పెంచకుండా ప్రజలందరికీ ఉచిత విద్యుత్తు అందిస్తున్నారని దీనికి కారణం విద్యుత్ పోరాట అమరుల ప్రాణ త్యాగ ఫలితమేనని అన్నారు.సమస్యలతో సతమవుతున్న ప్రజలు కదిలితే ఉద్యమం ఎలా ఉవ్వెత్తున ఎగిసిపడుతుందో చరిత్రలో నిలిచిన ఉద్యమన్నారు.కేంద్ర ప్రభుత్వం మతోన్మాద,కార్పొరేట్ విధానాలను కొనసాగిస్తుందని,రాబోయే కాలంలో సరళీకరణ,ఆర్థిక,మతోన్మాద,కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలందరూ పెద్ద ఎత్తున ఉద్యమాలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాలలో అనేక రకాల సమస్యలు పేరుకుపోయాయని స్థానిక సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా బలమైన ఉద్యమాలు నిర్మిస్తున్నామని అన్నారు.ప్రజలందరూ ఈ స్థానిక సమస్యల పరిష్కారం కోసం ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు కుర్ర ఉప్పలయ్య,కత్తుల రాజు,మునిగే నరసింహులు,నాయకులు పింగిలి.మల్లారెడ్డి పింగిలి పెద్దిరెడ్డి,పి.ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.




## బషీర్‌బాగ్ విద్యుత్ ఉద్యమ స్ఫూర్తితో-బీజేపీ తెచ్చిన 2020 విద్యుత్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమించుదాం

**-మాలోతు సాగర్ ఎం.సి.పి.ఐ (యు) వరంగల్ నగర కార్యదర్శి**

తెలుగు గళం వరంగల్,ఆగస్టు 28




బషీర్‌బాగ్ విద్యుత్ ఉద్యమ అమరవీరుల పోరాట దినోత్సవం సందర్భంగా గురువారం వరంగల్ ఓంకార్ భవనంలోని ఎం.సి.పి.ఐ (యు)జిల్లా కార్యాలయంలో నగర కమిటీ ఆధ్వర్యంలో సభ జరిగింది.ఈ సమావేశానికి నగర సహాయ కార్యదర్శి సుంచు జగదీశ్వర్ అధ్యక్షత వహించగా,నగర కార్యదర్శి మాలోతు సాగర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాలోతు సాగర్ మాట్లాడుతూ..“2000 ఆగస్టు 28న బషీర్‌బాగ్ వద్ద విద్యుత్ ఉద్యమకారులపై జరిగిన తూటాల వర్షంలో రామకృష్ణ,విష్ణువర్ధన్ రెడ్డి,బాలస్వామి అమరులయ్యారు. వారి త్యాగంతోనే విద్యుత్ రంగం ప్రభుత్వరంగంలో కొనసాగింది.రైతాంగానికి ఉచిత విద్యుత్,పేదలకు రాయితీలు అందుతున్నాయి.అదే పోరాట స్ఫూర్తితో బీజేపీ తెచ్చిన 2020 విద్యుత్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం నిర్మించాలి”అని పిలుపునిచ్చారు.కేంద్ర ప్రభుత్వం విద్యుత్ పంపిణీని ప్రైవేటు కంపెనీలకు అప్పగించడానికి ప్రయత్నిస్తోందని,సబ్సిడీలను తగ్గించి స్మార్ట్ మీటర్ల పేరుతో రైతులకు భారాలు మోపదలచుకుంటోందని ఆయన ఆరోపించారు. “ప్రజల శ్రమతో నిర్మించుకున్న విద్యుత్ సంస్థలను ఆదానీ,అంబానీలకు అప్పగించనివ్వకూడదు”అని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు ముక్కెర రామస్వామి,ఎగేని మల్లికార్జున్,ఐత నాగేష్,గణిపాక ఓదెలు,ఎండి మహబూబ్ పాషా,సింగారపు దాసు,మాలి ప్రభాకర్,ఏ.నర్సయ్య,ఆర్.ఐలయ్య,బాపు రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

SAI BALAJI DIGITALS PVT LTD

## భారత్‌పై మరోసారి అక్కసు వెళ్లగక్కిన అమెరికా




"ఉక్రెయిన్ తమ దేశాన్ని, యూరప్‌ను అధికంగా నగదు ఇవ్వాలని కోరుతోంది. భారత్ చమురు కొనుగోళ్ల కారణంగా అమెరికాలో ప్రతి ఒక్కరూ నష్టపోతారు. వినియోగదారులు, వ్యాపారులు నష్టపోతారు. భారత్‌పై అధిక సుంకాలతో ఉద్యోగాలు, ఆదాయం మరియు అధిక వేతనాలకు కారణమవుతుంది. దీంతో కార్మికులు నష్టపోతారు. మోడీ యుద్ధానికి మనం నిధులు సమకూర్చాల్సి వస్తోంది.. దీంతో పన్ను చెల్లింపుదారులు నష్టపోతారు " అని నోవార్ పేర్కొన్నారు. శాంతికి మార్గం భారత్‌నుండే వెళుతుందని అన్నారు. భారత్ అహంకారంతో తన ఇంధన అవసరాలకే ప్రాముఖ్యతనిస్తోందని అన్నారు.

## పన్నుల వల్ల భారత్ అమెరికా సంబంధాలు దెబ్బతింటాయి

ట్రంప్ విధించిన సుంకాలు బుధవారం (ఆగస్టు 27) నుంచే అమల్లోకి వచ్చాయి. ఈ విషయంపై తాజాగా రఘురామ్‌రాజన్ ఇండియా టుడే టివి ఛానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'అమెరికా చర్య ముఖ్యంగా భారత్‌లోని రొయ్యల రైతుల, వస్త్ర తయారీదారులు వంటి చిన్న ఎగుమతిదారులను దెబ్బతీస్తుందని, జీవనోపాధిని ప్రమాదంలో పడేస్తుంది. ఇది తీవ్ర బాధాకరం' అని ఆయన అన్నారు.

నేటి ప్రపంచ క్రమంలో వాణిజ్యం, పెట్టుబడి, ఆర్థికం ఎక్కువగా ఆయుధంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత్ జాగ్రత్తగా నడవాలి. అమెరికా తీసుకున్న ఈ చర్య ఒకరంగా భారత్ మేల్కొవడానికి పిలుపునిచ్చినట్లే భావించాలి. ఇప్పటి నుంచైనా మనం ఏ ఒక్క దేశంపైనా ఎక్కువగా ఆధారపడకుండా ఉందాం. మనం ఇప్పుడు తూర్పువైపు.. అంటే యూరప్‌వైపు, ఆఫ్రికావైపు చూద్దాం. మరోవైపు అమెరికాతో వాణిజ్య సంబంధాలను కొనసాగిద్దాం. మనం 8-8.5 శాతం వృద్ధిని సాధించడంలోనూ, యువతకు ఉపాధిని కల్పించడానికి అవసరమైన సహాయపడే సంస్కరణలను ప్రారంభిద్దాం' అని ఆయన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

రష్యా చమురు దిగుమతులపై భారత్ మరోసారి పునఃపరిశీలించాలి

రష్యా చమురు దిగుమతులపై అసలు ఎవరికి లాభం? ఎవరికి నష్టం అని మనం ఆలోచించుకోవాలి. శుద్ధి కర్మాగారాలు అదనపు లాభాలను ఆర్జిస్తున్నాయి. కానీ ఎగుమతిదారులు మాత్రం సుంకాల ద్వారా ధర చెల్లిస్తున్నారు. ప్రయోజనం పెద్దగా లేకపోతే.. మనం ఈ కొనుగోళ్లను కొనసాగించాలా వద్దా అని ఆలోచించుకోవాలి అని రఘురామరాజన్ ఈ ఇంటర్వ్యూలో అన్నారు. చైనా, జపాన్, అమెరికా.. ఇలా ఏ ఇతర దేశంతోనైనా కలిసి పనిచేయాలి. కానీ ఆ దేశాలపై మనం పూర్తిగా ఆధారపడకూడదు. సాధ్యమైన చోట మనం అభివృద్ధి చెందేందుకు తగిన ప్రత్యామ్నాయాలు కూడా ఉన్నాయని కూడా నిర్ధారించుకోవాలి అని ఆయన భారత ప్రభుత్వానికి సూచించారు. భారత్‌పై 50 శాతం పన్నులు విధించడం వల్ల భారత్ అమెరికా సంబంధాలు దెబ్బతినే అవకాశం ఉందని ఆయన అన్నారు.

## జమ్ము-శ్రీగర్ జాతీయరహదారి మూసివేత



కాశ్మీర్‌ను దేశంలోని ఇతర ప్రాంతాలతో కలిపే ఏకైక రహదారి ఇదే. 270 కి.మీ పొడవైన ఈ రహదారిపై ఉదంపూర్‌లోని జఖేని మరియు చెనాని మధ్య అనేక చోట్ల కొండచరియలు విరిగిపడటంతో మూసుకుపోయిందని అన్నారు. జమ్మూలోని నగ్రోటా నుండి రియాసి, చెనాని, పట్నీటాప్, దోడా, రాంబన్, బనిహాల్ మరియు శ్రీనగర్ నుండి ఎటువంటి వాహనాలను అనుమతించడం లేదని అన్నారు. కాత్రా మరియు ఉదంపూర్ పట్టణాలకు చెందిన యాత్రికులు తమ గుర్తింపు కోసం ఫొటో ఐడి కార్డులు తమ వద్దే ఉంచుకోవాలని, అప్పుడే ప్రయాణం సజావుగా సాగుతుందని అన్నారు.

మంగళవారం కురిసిన క్లౌడ్ బరెస్ట్ , ఆకస్మిక వరదలు కారణంగా ఏర్పడిన అడ్డంకులను తొలగించడానికి యంత్రాలు, బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బిఆర్‌ఒ) సిబ్బంది యత్నిస్తున్నారని అన్నారు. అలాగే కిష్త్వార్-సింథాన్-అనంతనాగ్ హైవేను సైతం మూసివేసినట్లు తెలిపారు. వాతావరణం అనుకూలించి, రహదారుల పరిస్థితి మెరుగ్గా ఉండి, బిఆర్‌ఒ నుండి గ్రీన్‌సిగల్ వస్తే.. శ్రీనగర్-సోనామార్గ్-గుమారి నుండి ట్రాఫిక్‌ను అనుమతించే అవకాశం ఉందని పేర్కొంది. సోనామార్గ్ నుండి కార్గిల్ వైపు ఎల్‌ఎంవి(లైట్ మోటార్ వెహికల్స్, హెచ్‌ఎంఆర్( హెవీ మోటార్ వెహికల్స్)ను ఉదయం 11.30 గంటల నుండి సాయంత్రం 5.30 వరకు అనుమతించాలని పేర్కొంది. కట్ ఆఫ్ సమయం తర్వాత ఏ వాహనాన్ని అనుమతింకూడదని వెల్లడించింది. శ్రీనగర్ నుండి కార్గిల్ వరకు శ్రీనగర్ నుండి కార్గిల్ వరకు ప్రయాణించే భద్రతా దళాల కాన్వాయ్‌లతో పౌరులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని ప్రకటన పేర్కొంది.

## ప్రపంచ ఆర్చరీ యూత్ ఛాంపియన్‌షిప్స్‌లో "చికిత తానిపర్తి"కి స్వర్ణ పతకం

- ♦ ప్రపంచ వేదికపై తెలంగాణ కూతురు కీర్తి పతాకం
- ♦ ప్రపంచ వేదికపై స్వర్ణ పతకం సాధించి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసిన చికితకు ఘన స్వాగతం పలికిన తెలంగాణ ప్రజలు
- ♦ క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి,ఎమ్మెల్యే విజయరమణరావు,ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్,స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి అభినందనలు




**తెలుగు గళం న్యూస్ శంషాబాద్,ఆగస్టు 28**

కెనడాలోని విన్నిపెగ్‌లో జరిగిన ప్రపంచ ఆర్చరీ యూత్ ఛాంపియన్‌షిప్స్‌లో అండర్-21 మహిళల విభాగంలో స్వర్ణ పతకం సాధించి దేశ కీర్తి పతాకాన్ని రెపరెపలాడించిన తెలంగాణ ముద్దుబిడ్డ చికిత తానిపర్తి స్వదేశానికి చేరుకుంది. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన చికిత విజయోత్సాహంతో హైదరాబాద్ శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకోగానే ఘన స్వాగతం లభించింది. క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి,పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణరావు,ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్,స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి స్వయంగా చికితకు అభినందనలు తెలియజేశారు. క్రీడాకారులు,అభిమానులు పూలమాలలతో ఘనంగా ఆత్మీయ స్వాగతం పలికారు. దేశానికే కాదు తెలంగాణకు ప్రత్యేక గౌరవం తీసుకొచ్చిన చికితపై గర్వం వ్యక్తం చేస్తూ,ప్రభుత్వం భవిష్యత్తులో అన్ని విధాల సహకారం అందిస్తామని మంత్రి శ్రీహరి హామీ ఇచ్చారు.

## క్రీడలతో పని ఒత్తిడి నుంచి ఉపశమనం ఉద్యోగులకు నిరంతరం క్రీడా పోటీలు

### రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి




**తెలుగు గళం న్యూస్ హైదరాబాద్,ఆగస్టు 28**

జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఎల్బీ స్టేడియంలో ఉద్యోగుల క్రీడా పోటీలను రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన క్రీడా విధానం పసిపిల్లలనుండి పెద్దవారివరకు అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఉద్యోగులు ఎప్పటికప్పుడు పని ఒత్తిడిలో ఉండే సందర్భంలో క్రీడలు వారికి మానసిక ప్రశాంతతను కలిగించడమే కాకుండా ఆరోగ్యకరమైన జీవితానికి దోహదం చేస్తాయని మంత్రి పేర్కొన్నారు. ఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటే ప్రభుత్వ పథకాలు మరింత సమర్థవంతంగా అమలవుతాయి"అని ఆయన అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో క్రీడల ప్రోత్సాహానికి ప్రాధాన్యత ఇస్తున్నామని,ఉద్యోగులకే కాకుండా సమాజంలోని అన్ని వర్గాలకు క్రీడలు చేరువ కావాలని కృషి చేస్తున్నామని అన్నారు. ప్రతి సంవత్సరం ఉద్యోగుల కోసం క్రీడా పోటీలను నిర్వహించడం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్,ప్రధాన కార్యదర్శి ఏలూరు శ్రీనివాసరావు,టీజీవో నాయకులు,వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు,స్పోర్ట్స్ అథారిటీ అధికారులు,కోచులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**గచ్చిబౌలి లో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు**

హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి పురస్కరించుకొని ఆగస్టు 29 గచ్చిబౌలి హాకీ స్టేడియంలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు జరగనున్నాయి. రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా వివిధ క్రీడాంశాల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులను సన్మానించడంతో పాటు,క్రీడాభిమానులను ఆకట్టుకునే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి తెలిపారు. అర్జున,ద్రోణాచార్య అవార్డు గ్రహీతలతో పాటు క్రీడా సంఘాల ప్రతినిధులు కూడా పాల్గొంటారని ఆయన వెల్లడించారు.

## గురుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య







**తెలుగు గళం న్యూస్ వరంగల్**

వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ మండలం జక్కలొద్దిలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల,కళాశాలను వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు,జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో కలసి గురువారం వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య భవనంలోని డార్మెంటరీ,భోజనశాల,తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థుల యోగక్షేమాలు,వారికి కావలసిన అవసరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో స్నేహపూర్వకంగా మాట్లాడి వారి భవిష్యత్ లక్ష్యాలు,ఆశయాలను తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు బోధన విధానంపై వివరాలు తీసుకుని,పాఠశాలలో అందిస్తున్న సౌకర్యాలు,ఆహారం నాణ్యత,పరిశుభ్రత,వసతి గదుల పరిస్థితిని ఎంపీ ప్రత్యక్షంగా పరిశీలించారు. కిచెన్ లోని కూరగాయలు,బియ్యం,పప్పులు,ఇతర సామగ్రిని పరిశీలించారు. ఎట్టి పరిస్థితుల్లో మెనూ ప్రకారం వంటలు చేయాలన్నారు. నాణ్యత విషయంలో రాజీ పడవద్దని ఎంపీ సూచించారు. వంట విషయంలో ఎలాంటి పొరపాట్లు చేయవద్దని సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థుల వివిధ సబ్జెక్టుల పఠన సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులు ఇచ్చిన సమాధానాలు,వారి ప్రతిభను అభినందించిన ఎంపీ డాక్టర్ కావ్య,వారికి నిరంతర సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు మరింత కృషి చేసి రాష్ట్రానికి,దేశానికి మంచి పేరు తీసుకురావాలని ప్రోత్సహించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు సమయానికి అందేలా చూడాలని అధికారులు,సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఎంపీ,ఎమ్మెల్యే,కలెక్టర్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.




## పూజారి సాంబయ్య మృతదేహానికి పూలమాలు వేసి నివాళులర్పించిన పరకాల శాసనసభ్యులు



తెలుగు గళం న్యూస్, పరకాల, ఆగస్టు 28.

గురువారం పరకాల పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ పిఎసిఎస్ చైర్మన్ పూజారి సాంబయ్య అనారోగ్యంతో మృతి చెందగా వారి పార్థివదేహాన్ని సందర్శించి,పూల మాలలు వేసి నివాళులు అర్పించిన పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రాజకీయ జీవనంలో నిజాయితీ, క్రమశిక్షణ,నిబద్ధతకు ప్రతీకగా నిలిచారని,పూజారి సాంబయ్య మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని అన్నారు.

## ఉల్లాస్ ట్రైనింగ్ పై అవగాహన సదస్సు



**మహబూబాబాద్ జిల్లా తెలుగు గళం న్యూస్**

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని రాంపురం ప్రాథమిక పాఠశాలలో ఉల్లాస్ ట్రైనింగ్ కార్యక్రమం చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో వాలంటీర్లకు ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది,ఈ సందర్భంగా ట్రైనింగ్ అర్పి గుర్రం వెంకన్న గౌడ్ మాట్లాడుతూ నవ భారత్ సాక్షరత కార్యక్రమం పై దీనిని న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రామ్ అని కూడా పిలుస్తారు అన్నారు,ఇది కేంద్ర ప్రాయోజిత చొరవ,ఇది జాతీయ విద్యా విధానం 2020కి అనుగుణంగా ఉంటుంది. అధికారిక పాఠశాల విద్యను కోల్పోయిన అన్ని నేపథ్యాల నుండి 15 ఏళ్లు మరియు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న పెద్దలకు సాధికారత కల్పించడం, వారు సమాజంలో కలిసిపోవడానికి మరియు దేశ వృద్ధికి దోహదపడటానికి ఇది లక్ష్యం అన్నారు,చదవడం, రాయడం మరియు సంఖ్యా నైపుణ్యాలతో సహా క్రియాత్మక అక్షరాస్యతను అందించడంపై దృష్టి పెడుతుంది మరియు అభ్యాసకులను క్లిష్టమైన జీవిత నైపుణ్యాలతో సుసంపన్నం చేస్తుంది, జీవితకాల అభ్యాసాన్ని పెంపొందిస్తుంది అన్నారు, స్వచ్ఛంద సేవ ద్వారా అమలు చేయబడిన ఉల్లాస్, సామాజిక బాధ్యత మరియు విధి భావాన్ని 'కర్తవ్య బోధ్'ను ప్రోత్సహిస్తుంది అన్నారు,అభ్యాసకులకు మరియు స్వచ్ఛంద ఉపాధ్యాయులకు ఇచ్చే సర్టిఫికెట్లు ఆత్మవిశ్వాసం మరియు ప్రేరణను మరింత పెంచుతాయి, నిరంతర పురోగతిని నడిపిస్తాయి అన్నారు, ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పసుపులేటి శోభ, రాంపల్లి వెంకన్న, పాల్వాయి రాధిక,పాల్వాయి సంధ్య,కొమ్ము కొమరమ్మ, చింతపల్లి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎస్.ఆర్.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ యూత్ అసోసియేషన్ సభ్యులకు డీజే బాక్స్ సెట్ పంపిణీ




**తెలుగు గళం న్యూస్ వరంగల్**

వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం గ్రామం ఎస్సీ కాలనీలోని 3వ వార్డ్ అంబేద్కర్ యూత్ అసోసియేషన్ సభ్యుల వినతి మేరకు ఎస్.ఆర్.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డీజే బాక్స్ సెట్ పంపిణీ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు,ఎస్.ఆర్.ఆర్ ఫౌండేషన్ చైర్మన్,బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపటి శ్రీనివాస్ రెడ్డి ఈ డీజే బాక్స్ సెట్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ మెంబర్ గాడిపెల్లి రాములు,అలాగే యూత్ అసోసియేషన్ సభ్యులు చిర్ర సుధాకర్,గాడిపెల్లి సాయి కిరణ్,లింగాల శ్రీనివాస్,చిర్ర అరుణ్,గాడిపెల్లి శ్రీనాథ్,చిర్ర వికాస్,గాడిపెల్లి వేణు,చిర్ర ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## మద్యం షాపుల్లో కల్లుగీత సొసైటీలకే రిజర్వేషన్ కల్పించాలి కల్లుగీత కార్మిక సంఘం డిమాండ్




**తెలుగు గళం న్యూస్**

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కొత్త మద్యం పాలసీపై కల్లుగీత కార్మిక సంఘం అసంతృప్తి వ్యక్తం చేసింది. గౌడులకు 15% రిజర్వేషన్ కల్పించడం వల్ల గీత కార్మికులకు అసలు ఉపయోగం జరగలేదని,ఎన్నికల ప్రణాళికలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం 25% రిజర్వేషన్ కల్లుగీత సొసైటీలు,టీఎఫ్‌టీ గ్రామాలకే ఇవ్వాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల వెంకటరమణ డిమాండ్ చేశారు. గురువారం రాంనగర్‌లోని రాష్ట్ర కార్యాలయంలో జరిగిన రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.."గత టీఆర్ఎస్ ప్రభుత్వం మద్యం షాపుల టెండర్లలో గౌడులకు 15%,ఎస్సీలకు 10%,ఎస్టీలకు 5% రిజర్వేషన్లు ఇచ్చింది. కానీ ఈ విధానం గీత కార్మికులకు లాభదాయకం కాలేదు. కల్లుగీత సొసైటీలకు ఇవ్వాల్సిన రిజర్వేషన్లు ఇతరుల చేతికి వెళ్లిపోయాయి. ఎన్నికల హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం 25% రిజర్వేషన్ కల్పించి మాట నిలబెట్టుకోవాలి"అన్నారు. అదేవిధంగా మద్యం ఉత్పత్తి రంగంలోని బేవరేజెస్,డిస్టిలరీస్,బాటిలింగ్ యూనిట్స్‌లో కూడా రిజర్వేషన్లు ఇవ్వాలని ఆయన సూచించారు. దీంతో సొసైటీలు బలోపేతం అవుతాయని,గీత కార్మికులకు ఆర్థిక భద్రత,ఉపాధి లభిస్తుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..ప్రమాదాలకు గురైన గీత కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఎక్స్ గ్రేషియా డబ్బులు తక్షణమే విడుదల చేయాలని,వృత్తి చేస్తున్న వారందరికీ సేఫ్టీ కిట్లు అందజేయాలని,50 ఏళ్లు పూర్తి చేసిన వారికి పెన్షన్ అమలు చేయాలని,నందనంలో నీరా మరియు తాటి ఈత ఉత్పత్తుల కేంద్రాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ సమస్యలపై సెప్టెంబర్‌లో అన్ని జిల్లాల్లో సదస్సులు నిర్వహించాలని నిర్ణయించబడింది. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బొలగాని జయరాములు,గౌని వెంకన్న,వి.వెంకట నర్సయ్య,బాల్నే వెంకట మల్లయ్య,పామనగుండ్ల అచ్చాలు,కార్యదర్శులు చౌగాని సీతారాములు,బూడిద గోపి,ఎస్.రమేష్ గౌడ్,బండ కింది అరుణ్,మడ్డి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

## 31వ తేదీలోగా వసతులు సమకూర్చాలి హన్మకొండ కలెక్టర్ స్నేహ శబరీష్

### జేఎన్ఎస్ స్టేడియంలో తాత్కాలిక స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాట్ల పరిశీలన



**తెలుగుగళం హన్మకొండ న్యూస్**

హనుమకొండ లోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ తాత్కాలిక ప్రారంభానికి అవసరమైన సదుపాయాలను గురువారం కలెక్టర్ స్నేహ శబరీష్ క్షేత్ర స్థాయిలో పర్యటించి వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేడియం ఆవరణలో ఉన్న హాస్టల్ భవనాలు, అవుట్ డోర్, క్రీడా మైదానాలను పరిశీలించి వాటిలో చేపట్టాల్సిన మరమ్మత్తులు, కల్పించాల్సిన సదుపాయాలను విద్యార్థులకు క్రీడా సదుపాయాలు ఈనెల 31వ తేదీలోగా ఏర్పాట్లు సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా డివైఎస్ఓ అశోక్ కుమార్ ను ప్రస్తుతం ఏర్పాటు చేసిన మౌలిక వసతుల గురించి చర్చించారు. అలాగే జేఎన్ఎస్ స్టేడియం ఆవరణలో విద్యార్థులకు హాస్టల్ వసతిలో ఉండాల్సిన సదుపాయల కల్పనకు, ఇండోర్, అవుట్ డోర్ క్రీడా సదుపాయాలు, పరికరాల ఏర్పాటుకు, అవసరమైన మరమ్మత్తులకు వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఇ.ఇ. ఆర్అండ్ బీ సురేష్, నరేందర్ రెడ్డి, కోచ్ లు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ అభినందన సన్మాన మహోత్సవ ఆత్మీయ ఆహ్వానము

36 సం॥రాల నిరంతర సేవా తత్పరులు, స్నేహశీలి, మృదుస్వభావి, సహృదయశీలి

## శ్రీమతి వంగోలు శాంతి కుమారి

గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ZPHS-ఇబ్రహీంపూర్, జి॥ జనగామ.

## ఉద్యోగ విరమణ వీడ్కోలు అభినందన సభ



తేది : 29-08-2025 ఉదయం గం॥ 11-00 ని.లకు
స్థలం : సాయిరాం కన్వెన్షన్ హాల్, హైద్రాబాద్ రోడ్, జనగామ.

సమావేశ అధ్యక్షులు : శ్రీ చాడా గణేష్ రెడ్డి గారు, ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు

ముఖ్య అతిథి : శ్రీ పర్మార్ పింకేష్‌కుమార్ లలిత్ కుమార్ గారు, జిల్లా విద్యాశాఖాధికారి, అడిషినల్ కలెక్టర్, జనగామ.

విశిష్ట అతిథి : శ్రీ చావా రవి గారు, TSUTF రాష్ట్ర అధ్యక్షులు

ప్రత్యేక అతిథులు : శ్రీమతి డా॥ జి.ఉషారాణి గారు, డైరెక్టర్, అడల్ట్ ఎడ్యుకేషన్, తెలంగాణ, స్పెషల్ ఆఫీసర్, జనగామ జిల్లా
శ్రీ దర్శనం బోజన్న గారు, FAO, DEO కార్యాలయం
శ్రీ పాకనాటి రఘునందన్ రెడ్డి గారు, MEO, రఘునాథపల్లి.
శ్రీ చీటకోడూరు ఆనంద్ కుమార్ గారు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు
శ్రీమతి అంబీరు అరుణ గారు, AAPC ఛైర్‌పర్సన్

అతిథులు : శ్రీ కానుగంటి రంజిత్ కుమార్ గారు, TSUTF రాష్ట్ర కార్యదర్శి
శ్రీ ఆకుల శ్రీనివాసరావు గారు, TSUTF, FWF రాష్ట్ర డైరెక్టర్
శ్రీ త్యాగరాజన్ రవికుమార్ గారు, TGHMA జిల్లా అధ్యక్షులు
శ్రీ గుగులోతు చంద్రభాను గారు, TGHMA జిల్లా ప్రధాన కార్యదర్శి
శ్రీ పెచ్చెట్టి చంద్రశేఖర్ రావు గారు, TSUTF జిల్లా అధ్యక్షులు
శ్రీ మడూరి వెంకటేష్ గారు, TSUTF జిల్లా ప్రధాన కార్యదర్శి
శ్రీ ఆలేటి యాదవరెడ్డి గారు, TSUTF మండల అధ్యక్షులు
శ్రీ బైరగోని వవన్ కుమార్ గారు, TSUTF మండల ప్రధాన కార్యదర్శి

ఆహ్వానితులు : జనగామ జిల్లా మరియు రఘునాథపల్లి మండలంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

ఆహ్వానించువారు :

**ఉపాధ్యాయ బృందం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ మరియు విద్యార్థులు**
**ZPHS ఇబ్రహీంపూర్, మం॥ రఘునాథపల్లి, జి॥ జనగామ.**

## స్టేషన్ ఘన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యార్థుల కోసం ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు



**తెలుగు గళం న్యూస్**

జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మునిసిపాలిటీ పరిధిలోని జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాలలో విద్యార్థుల కోసం ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని మండల విద్యాశాఖ అధికారి కొమురయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఘనపూర్ మండలంలోని ప్రభుత్వ,ప్రైవేటు,రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులు ఆధార్ నమోదు చేసుకోవడానికి సౌకర్యం కల్పించామని తెలిపారు. రాష్ట్ర,జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి విద్యార్థికి ఆధార్ కార్డు తప్పనిసరి అని గుర్తు చేశారు. ఇంకా,ఆధార్ నమోదు చేయించని వారు,ఆధార్ కార్డులో మార్పులు చేయించుకోవలసిన వారు ఈ ప్రత్యేక నమోదు కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి పాఠశాల విద్యార్థుల ఆధార్ నమోదు బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనని ఆయన స్పష్టం చేశారు. స్టేషన్ ఘనపూర్ మండల పరిధిలో విరంచి ఏజెన్సీ ఆధ్వర్యంలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాటిలో ఒకటి జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాల,స్టేషన్ ఘనపూర్ లో,మరొకటి ఇప్పగూడెంలో ఏర్పాటు చేశారు. స్టేషన్ ఘనపూర్ పరిధిలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఘనపూర్ స్టేషన్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మిసరగండ్ల సంపత్,ఎమ్మార్సీ సిబ్బంది గిరి,లవన్,రమేష్,ఆధార్ సెంటర్ ఇంచార్జ్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాల ముందు జాగ్రత్త చర్యలు

### హసన్‌పర్తి పరిధిలో 29 మంది డి.జె యజమానులపై బైండోవర్




**తెలుగు గళం న్యూస్**

రాష్ట్రవ్యాప్తంగా గణేష్ ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులు సూచించారు. వరంగల్ కమిషనర్ ఆదేశాలు,సుప్రీమ్ కోర్టు మార్గదర్శకాల మేరకు హసన్‌పర్తి మండల పరిధిలోని 29 మంది డి.జె యజమానులను బైండోవర్ చేశారు. హసన్‌పర్తి తహశీల్దార్ ఎదుట ఈ చర్యలు అమలులోకి తెచ్చారు. డి.జె ల వలన శబ్ద కాలుష్యం పెరగడం,వివాదాస్పద పరిస్థితులు తలెత్తే అవకాశం ఉండటంతో ముందస్తుగా యజమానులను పిలిపించి బాధ్యతలు గుర్తు చేశారు. ఈ సందర్భంగా హసన్‌పర్తి ఎస్.హెచ్.వో మాట్లాడుతూ.. "ప్రజల మతపరమైన ఉత్సవాలు ప్రశాంతంగా,ఆనందంగా జరగాలని పోలీసులు ఎల్లప్పుడూ కృషి చేస్తారు. కానీ శాంతిభద్రతలకు భంగం కలిగించే పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి. కాబట్టి డి.జె యజమానులు నియమ నిబంధనలు పాటిస్తూ సహకరించాలని కోరుతున్నాము" అని తెలిపారు. హసన్‌పర్తి పోలీసులు,రెవెన్యూ అధికారులు కలిసి ఈ చర్యల్లో పాల్గొన్నారు. ప్రజలందరూ శాంతి,సోదరభావంతో గణేష్ ఉత్సవాలను జరుపుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## సెప్టెంబర్ 5న పెన్షన్ల పెంపు కోసం మానకొండూరులో ఆందోళన సన్నాహాలు

### ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు

**తెలుగు గళం న్యూస్**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎంఆర్పిఎస్ జిల్లా ఇంచార్జి మంద రాజు మాదిగ బహిరంగంగా విరుచుకుపడ్డారు. వికలాంగుల పెన్షన్‌ను రూ. 6000కు,వృద్ధులు,వితంతువులు,ఒంటరి మహిళలు,నేత,గీత,బీడీ కార్మికుల పెన్షన్‌ను రూ. 4000కు పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మానకొండూర్ మండల కేంద్రంలో విహెచ్పిఎస్ చేయూత పెన్షన్ దారుల విలేకరుల సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంద రాజు మాదిగ మాట్లాడుతూ.. "అధికారంలోకి రాకముందు పెన్షన్ల పెంపు హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ దాన్ని నెరవేర్చలేదు. సీఎం రేవంత్ రెడ్డి అధికార సుఖాలను మాత్రమే అనుభవిస్తున్నారు




కానీ,పెన్షన్ దారుల కష్టాలపై ఎలాంటి శ్రద్ధ చూపడం లేదు. ఈ నిర్లక్ష్యం వల్ల లక్షలాది పెన్షన్ దారులు కాంగ్రెస్ పార్టీకి దూరం అవుతారు" అని విమర్శించారు. ఈ నేపథ్యంలో,పెన్షన్ల పెంపు కోసం సెప్టెంబర్ 5న మానకొండూర్ పల్లె మీద చౌరస్తా వద్ద విహెచ్పిఎస్ చేయూత పెన్షన్ దారుల సన్నాహక సదస్సు నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెజ్జంకి అనిల్ మాదిగ,వడ్డేపల్లి రామచంద్రం,మారపల్లి శ్రీనివాస్ మాదిగ,చంచలనవీన్ మాదిగ,దండు వరలక్ష్మి మాదిగ,కొత్తూరు రాజన్న మాదిగ,ఆడపు నరసన్న మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలోని ఆ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు

**తెలుగు గళం న్యూస్**

తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో నేడు అతి నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తర తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో అత్యంత భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు వెల్లడించింది. ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, ఉమ్మడి కరీంనగర్, మెదక్, వికారాబాద్ జిల్లాలకు అతి భారీ వర్ష సూచన ఉన్నట్లు తెలిపింది. ఈ ఐదు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసినట్లు వెల్లడించింది. ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, యాదాద్రి భువనగిరి, మహబూబ్ నగర్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

## మంతన్ గౌరెల్లి గ్రామంలో సిపిఎం ధర్నా సమస్యల పరిష్కారం కోరిన ప్రజలు

**తెలుగు గళం మంతన్ గౌరెల్లి,ఆగస్టు 28**

రంగారెడ్డి జిల్లా యాచారం మండల పరిధిలోని మంతన్ గౌరెల్లి గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆధ్వర్యంలో స్థానిక సమస్యల పరిష్కారంకోసం ధర్నా జరిగింది. 2వ వార్డులో ఇంటింటికీ తిరిగి సర్వే చేసిన అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయం ముందు పార్టీ నాయకులు,గ్రామస్తులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్. చందు నాయక్,మాజీ ఎంపిటిసి తావు నాయక్ మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నీళ్లు గ్రామంలో అందడం లేదని,బోర్ నీళ్లు కూడా 15 రోజులకు ఒకసారి మాత్రమే వస్తున్నాయని,ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పైపులు లీకేజీల కారణంగా నీటి సరఫరా పూర్తిగా ఆగిపోతోందని,వెంటనే కొత్త పైపులైన్ వేయాలని డిమాండ్




చేశారు. వీధి దీపాలు లేక గ్రామం చీకటిమయం అవుతోందని,డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతిని మురికి నీళ్లు రోడ్లపై చేరి దుర్వాసన వ్యాపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సీసీ రోడ్లు తవ్వివేసి వాహనాలు,పాదచారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని విమర్శించారు. నాయకులు హెచ్చరిస్తూ,సమస్యలు తక్షణమే పరిష్కరించకపోతే బిందెలతో గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని స్పష్టం చేశారు. దీనిపై గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. వారం రోజుల్లో మిషన్ భగీరథ నీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ కార్యదర్శి కందుల శ్రీరాములు,బట్టు జంగయ్య,కె. కుమార్,ఎస్. రవి,ఎస్. భాస్కర్ నాయక్,కాటిక విష్ణు,పోలేరాజు,కనక యాదయ్య,ఎర్ర వంశీ,అలంపల్లి ప్రవీణ్,కనుక క్రాంతి,ఈర్ల భానుప్రసాద్,పటాన్ అమ్జాద్ ఖాన్,ఈర్ల క్రాంతి,పటాన్ మబ్బులు,కనక నరసింహ,కనుక విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## ఆడపడుచులకు ఆర్థికంగా అండ కల్యాణలక్ష్మి పథకం

- ఉమ్మడి రేగొండ మండలంలో కల్యాణలక్ష్మి మరియు షాదీ ముబారక్ లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే..
- పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ఒక్క రేషన్ కార్డు ఇచ్చిన పాపాన పోలేదన్న ఎమ్మెల్యే..







**తెలుగు గళం న్యూస్ జయశంకర్ భూపాలపల్లి రేగొండ/కొత్తపల్లి గోరి**

రాష్ట్రంలో పేదింటి ఆడపడుచులకు కల్యాణలక్ష్మి పథకం ఆర్థికంగా ఎంతో తోడ్పడుతుందని, సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అన్ని వర్గాల ప్రజలకు అందిస్తున్నట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఈరోజు గురువారం భూపాలపల్లి నియోజకవర్గంలోని ఉమ్మడి రేగొండ మండలంలో రేగొండ, కొత్తపల్లి గోరి ఎమ్మార్వోల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి మరియు షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. రేగొండ మండలంలో జరిగిన చెక్కుల పంపిణీ కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ అశోక్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భూపాలపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 296 మంది కల్యాణలక్ష్మి మరియు షాదీ ముబారక్ లబ్దిదారులకు రూ. 2,96,34,336 విలువైన చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి పథకం పేద కుటుంబాలకు ఎంతో అండగా నిలుస్తుందన్నారు. ఈ పథకం ద్వారా అనేకమంది యువతులు సుఖసంతోషాలతో కొత్త జీవితాన్ని ఆరంభిస్తున్నట్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో ప్రతీ అర్హులైన వారందరికీ సహాయం అందేలా చూస్తానని ఎమ్మెల్యే అన్నారు. పేద, నిరుపేదలకు అండగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. రాష్ట్రంలో చాలా కాలం తర్వాత ప్రజా ప్రభుత్వం రేషన్ కార్డులు పంపిణీ చేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వంలో ప్రజలు రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకొని, ఆఫీసుల చుట్టూ కాళ్ల చెప్పులరిగేలా తిరిగి అలిసిపోయారే,తప్ప వారికి ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదని ఎద్దేవా చేశారు. ప్రజా ప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా కొత్త రేషన్ కార్డులు ఇవ్వడం జరుగుతుందని,గతంలో ఉన్న రేషన్ కార్డులలో వారి కుటుంబ సభ్యులను జత చేయడం జరిగిందని,రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని అన్నారు. ఈ కార్యక్రమాలల్లో ఆయా మండలాల ప్రజా ప్రతినిధులు,ప్రభుత్వ అధికారులు,కాంగ్రెస్ పార్టీ నేతలు,కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

## పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపు కోసం హన్మకొండ కలెక్టర్ సమీక్ష



**తెలుగు గళం న్యూస్ హన్మకొండ**

హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ గురువారం జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల హాజరు,నమోదుదారితనం మరియు విద్యా నాణ్యత అంశాలపై విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమీక్షలో జిల్లా విద్యాశాఖ అధికారులు,వివిధ మండలాల ఎంఈవోలు,సమగ్ర శిక్షణ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈవో వాసంతి మరియు ఎంఈవోలు పాఠశాలల హాజరు శాతాలు,విద్యార్థుల నమోదు వివరాలు కలెక్టర్ కు వివరించారు. కలెక్టర్ స్నేహ శబరీష్ పాఠశాలకు రాకపోవడంపై గైర్హాజరు కారణాలను తెలుసుకోవాలని,పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఎంఈవోలు,ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలని ఆదేశించారు. అలాగే ఉపాధ్యాయుల ఎఫ్ఆర్ఎస్ నమోదు సరైన రీతిలో చేయడం,తరగతి గదిలో ప్రతి విద్యార్థిని పరిశీలించి అభ్యసన సామర్థ్యాలను తెలుసుకోవడం వంటి సూచనలను ఇచ్చారు. ఈ సమీక్ష ద్వారా హనుమకొండ జిల్లా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు,నమోదు మరియు విద్యా నాణ్యతను మెరుగువరిచే చర్యలకు దారి తీయబడనుంది.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు భోజనాన్ని అందించాలి

- విద్యార్థుల భవిష్యత్తు కొరకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందన్న ఎమ్మెల్యే జీఎస్సార్..
- విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించిన ఎమ్మెల్యే..
- లింగాల మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే..
- విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన ఎమ్మెల్యే..
- స్టోర్ రూమ్ లో కుళ్లిపోయిన టమాటాలను చూసి ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే..





**తెలుగు గళం న్యూస్ జయశంకర్ భూపాలపల్లి రేగొండ/**

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆహారాన్ని అందించాలని, విద్యార్థుల భవిష్యత్తు కొరకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఈరోజు గురువారం భూపాలపల్లి నియోజకవర్గం రేగొండ మండలం లింగాల క్రాస్ రోడ్డులో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాల మరియు వసతి గృహాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్థానిక కాంగ్రెస్ నేతలతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఎమ్మెల్యే కు పాఠశాల ప్రిన్సిపల్, సిబ్బంది మరియు విద్యార్థులు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే తరగతి గదుల్లో కలియ తిరుగుతూ విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కిటికీలకు మెష్ డోర్ లేకపోవడంతో దోమలు వస్తున్నాయని,గ్రౌండ్లో వర్షపు నీరు నిలుస్తుందని విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా,అట్టి సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అద్దె భవనంలో కొనసాగుతున్న గాంధీనగర్(లింగాల) మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలను త్వరలోనే ప్రభుత్వ భవనంలోకి షిఫ్ట్ చేసేలా చూస్తానని ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వం నుండి అద్దె తీసుకుంటున్న పాఠశాల ప్రైవేటు భవన యజమానిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ ఉన్న వసతులపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని వసతి గృహాల్లో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు భోజనాన్ని అందించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. అందులో భాగంగానే విద్యార్థులకు మెస్ చార్జీలతో పాటు కాస్మోటిక్ ఛార్జీలను కూడా పెంచినట్లు ఎమ్మెల్యే గుర్తుచేశారు. విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి ఉపయోగపడే విధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రభుత్వ అధికారులు,సీనియర్ కాంగ్రెస్ నాయకులు,మండల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విజయవాడలో డ్రగ్స్ కలకలం

### 19 గ్రాముల ఎండిఎంఏ స్వాధీనం

### పోలీసుల అదుపులో ఇద్దరు విద్యార్థులు




**తెలుగు గళం న్యూస్** విజయవాడలో మరోసారి డ్రగ్స్ రవాణా కలకలం సృష్టించింది. విజయవాడలో తరచూ డ్రగ్స్ ఆనవాళ్లు దొరకడం స్థానికులను ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది ఇప్పటికే మూడుసార్లు వివిధ సందర్భాల్లో డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు తాజాగా గురువారం తెల్లవారుజామున ఎండిఎంఎ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. విశాఖపట్నానికి చెందిన అర్జల శ్రీ వాత్సవ్, బి.హవిలా అన్న ఇద్దరు విద్యార్థుల నుండి 19 గ్రాముల ఎండిఎంఎను మాచవరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**బెంగళూరు నుండి విశాఖపట్నానికి**

విశాఖపట్నంలో ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈజీ మనీ కోసం డ్రగ్స్ సప్లై చేయాలని విశాఖపట్నం నుండి బెంగళూరు డ్రగ్స్ కొనుగోలు చేసేందుకు వెళ్లారు. అక్కడ సుమారు లక్ష రూపాయల విలువైన 19 గ్రాముల ఎండిఎంఎ డ్రగ్స్ కొనుగోలు చేసుకుని తిరుగు ప్రయాణం ప్రైవేటు ట్రావెల్స్‌లో విశాఖపట్నం వెళుతుండగా ఈగల్ టీమ్‌కు వచ్చిన పక్కా సమాచారంతో విజయవాడలోని మహానాడు రోడ్డు జంక్షన్ వద్ద గురువారం తెల్లవారుజామున 3:30 గంటలకు బస్సు చెక్ చేసి వీరిని అదుపులోకి తీసుకున్నారు. పూర్తిస్థాయి తనిఖీల అనంతరం వీరి వద్ద 19 గ్రాముల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం వీరిద్దరిని మాచవరం పోలీసులు అదుపులోకి తీసుకుని పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నారు.

SAI BALAJI DIGITALS PVT LTD